
RNI NO : TELTEL/2023/88524

మెదక్ టుడే దిన పత్రిక

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 176

బుధవారం, జూన్ 10, 2026, పేజీలు - 4 వెల : 2/-




# 12 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎన్‌డీయే..

## ఇండియా బ్లాక్ సమావేశం తర్వాత కీలకం కానున్న భేటీ

**న్యూఢిల్లీ, జూన్09:** కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయే కూటమి 12 ఏళ్లు అధికారం పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బుధ, గురు వారాల్లో ఎన్‌డీయే పక్షాల కీలక భేటీ జరగనున్నట్లు తెలుస్తోంది. 12 ఏళ్లు పూర్తైన సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకోవడంతోపాటు, భవిష్యత్‌లో ఎలా కలిసి ముందుకు వెళ్లాలి అనే అంశాలపై ఈ భేటీ జరగనుంది. ఇప్పటికే ఎన్‌డీయేకు చెందిన నేతలు సమావేశం కోసం ఢిల్లీ చేరుకున్నారు.ః మంగళవారం కూడా సమావేశం జరిగే అవకాశం ఉంది. ఇక గురువారం ప్రధాని మోదీ.. ఎన్‌డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో కూడా భేటీ కానున్నారు. తమ పాలన ఉన్న రాష్ట్రాల్లో వికసిత్ భారత్ కోసం ఎలా పని చేయాలి, పశ్చిమాసియా సంక్షభాన్ని ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలపై మోదీ వారితో



చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే దేశంలో చమురు ధరలు పెరగడం వల్ల ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అలాగే, ద్రవ్యోల్బణం కూడా సమస్యగా మారుతోంది. ఈ పరిస్థితిని ఎదుర్కునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాని చర్చిస్తారు. మరోవైపు రాజకీయంగానూ ఈ భేటీ ఎన్‌డీయేకు చాలా కీలకం.ఇండియా కూటమి పక్షాల భేటీ సోమవారం ఢిల్లీలో జరిగిన సంగతి తెలిసిందే. డీఎంకే, ఆప్, కమ్యూనిస్ట్ పార్టీలు మినహా ఎక్కువ పార్టీలు ఈ భేటీకి హాజరయ్యాయి. దీంతో ఇండియా కూటమి భవిష్యత్‌లో బలంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ఎన్‌డీయే భేటీ చాలా కీలకంగా మారనుంది. ఏపీలో ఎన్‌డీయే కూటమి అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. దీంతో ఢిల్లీలో జరిగే సమావేశానికి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరవుతారు. ప్రధానితో భేటీ అనంతరం వీరు నీతి అయోగ్ సమావేశంలో కూడా పాల్గొంటారు.

### కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు..

# మంత్రి ఉత్తమ్ ధ్వజం



**హైదరాబాద్, జూన్ 9 :** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ కూడా.. తెలంగాణలో సేకరించినంతా ధాన్యం సేకరించలేదని తెలిపారు. అలాంటి బీజేపీ ఇక్కడ యాత్రలు చేస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాలు చెప్పేవి అన్ని అబద్దాలేనని చెప్పారు. ధాన్యం విషయంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని పదిసార్లు కలిశామని తెలిపారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని కోరామని.. కానీ కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదని ప్రశ్నించారు. ఈరోజు(మంగళవారం) సచివాలయం వేదికగా మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రైతులపై బీజేపీ వైఖరి స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని తెలిపారు. అందుకే కేంద్రం వడ్లు కొనడానికి సుముఖంగా లేదని చెప్పుకొచ్చారు.

### ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ

# ప్రజల బతుకులు మారలేదు

## : కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, జూన్09:** తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు.

# రేవంత్ సర్కార్‌కు షాకిచ్చిన హైకోర్టు..

## మల్కాజిగిరి కార్పొరేషన్ బిల్డింగ్ నిర్మాణానికి బ్రేక్

**హైదరాబాద్:** రేవంత్ రెడ్డి సర్కార్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మల్కాజిగిరి కార్పొరేషన్ బిల్డింగ్ నిర్మాణానికి హైకోర్టు బ్రేకులు వేసింది. ఆ భవన నిర్మాణం చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో 5 రిట్ పిటిషన్లు దాఖలు కాగా.. వాటిపై విచారణ జరిపిన హైకోర్టు.. స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు అక్కడ ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని తేల్చి చెప్పింది. తెలంగాణలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)ని 3 కార్పొరేషన్లుగా విభజించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కొత్తగా ఏర్పడిన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)కి కొత్త భవనం నిర్మించేందుకు.. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




శంకుస్థాపన చేశారు. అయితే ఆ ఎంఎంసీ కొత్త బిల్డింగ్ నిర్మాణానికి బ్రేక్ పడింది. మల్కాజిగిరి కార్పొరేషన్ భవన నిర్మాణం చేపట్టవద్దని తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భవనం నిర్మించవద్దంటూ దాఖలైన రిట్ పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణాన్ని అడ్డుకోవాలంటూ.. మొత్తం 5 రిట్ పిటిషన్లు తెలంగాణ హైకోర్టులో దాఖలయ్యాయి. ఆ పిటిషన్లన్నింటిపైనా ఇవాళ విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఇరుపక్షాల వాదనలు విన్నది. వాదనల తర్వాత.. మల్కాజిగిరి కార్పొరేషన్ భవన నిర్మా ణంపై స్టేటస్ కో ఇస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హైకోర్టు స్పష్టం చేసింది.ఈ క్రమంలోనే ఈ ఎంఎంసీ వివా దానికి సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయా లని తెలంగాణ సర్కార్‌కు ఈ సందర్భంగా హైకోర్టు ఇచ్చింది.

# బెంగాల్ మరో సంచలనం..

## మమతా బెనర్జీ నివాసంలో సీఐడీ సోదాలు



**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఓటమితో టీఎంసీ పేక మేడలా కూలుతోంది. ఆ పార్టీలో అంతర్గత సంక్షోభం రోజు రోజుకూ తీవ్రమవుతోంది. ఇదే సమయంలో బెంగాల్ అసెంబ్లీని కుదిపేసిన సంతకాల కుంభకోణం టీఎంసీలో ప్రకంపనలు రేపుతోంది. అసెంబ్లీలో శోభన్‌దేబ్ చటోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా నియమిస్తున్నట్టు రాసిన లేఖలో సంతకాలు తమవి కాదని, ఫోర్జరీ చేశారని టీఎంసీ ఎమ్మెల్యేలు ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదయ్యింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా దీదీ నివాసంలో మంగళవారం సోదాలు నిర్వహించారు.పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి గడ్డుకాలం నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తృణమూల్ కాంగ్రెస్ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. టీఎంసీలో చీలికకు కారణమైన ఎమ్మెల్యేల నకిలీ సంతకాల ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) కోల్‌కతాలోని మమతా బెనర్జీ నివాసంలో సోదాలు నిర్వహించడం కలకలం రేపుతోంది.

# సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైర్..

## అంగన్‌వాడీల జీతాలు చెల్లించాలంటూ డిమాండ్

**హైదరాబాద్:** అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు.'రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62 వేల మంది అంగన్‌వాడీ



సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా?. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుంది. సాటి మహిళల కన్నీటి గోసను మహిళా మంత్రిగా ఉన్న సీతక్క అర్థం చేసుకోకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారి గౌరవాన్ని పెంచారు. వారు వర్కర్లు కాదని, టీచర్లని పేర్కొంటూ హోదాను ఉన్నతీకరించారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది.కానీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.13,650కు, మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.7,800కు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800కు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారు. అభయహస్తం కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.

# 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలపై సీఎం ఫోకస్..

## డేటా డ్రివెన్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యం

**అమరావతి, జూన్ 9 :** జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగుపరచడం, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవటమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలతో పాటు రియల్ గ్రోత్ ఆధారంగా పనితీరును అంచనా వేసేలా స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు, కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లపై సచివాలయంలో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో సమీక్షకు ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యాన, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖలకు కీ



పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను నిర్దేశించారు.

ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలి..రాష్ట్ర- క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని నిర్ణయించామని సీఎం చంద్రబాబు తెలిపారు. మౌలిక సదుపాయాలపై చేసే వ్యయం 3.5 రేట్ల మేర ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. రియల్ టైమ్‌లో ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు.

డ్రివెన్ గవర్నెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి..2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు.. సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతీ రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ పెంపుదల చేసేందుకు శ్రద్ధ పెట్టాలని మార్గనిర్దేశం చేశారు.

# ట్రంప్‌కు ఫెడరల్ కోర్టు బిగ్ షాక్..

## హెచ్-1బీ వీసాకు లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ తీర్పు



**అమెరికా:** అమెరికాలో స్థిరపడాలని కలలు కంటున్న అంతర్జాతీయ ఐటీ నిపుణులకు యూఎస్ న్యాయస్థానం ఊహించని ఊరటనిచ్చింది. హెచ్-1బీ వీసా అభ్యర్థులపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల అదనపు రుసుము నిబంధనను బోస్టన్ ఫెడరల్ కోర్టు పూర్తిగా కొట్టేసింది. కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు ఇలాంటి పన్నులు విధించలేరని స్పష్టం చేశారు. దీంతో విదేశీ వలసదారులపై పడబోయే మోయలేని ఆర్థిక భారం తప్పినట్లు అయింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు మీకోసం. అమెరికాలో ఉద్యోగం చేయాలని ఆశించే అంతర్జాతీయ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగానికి యూఎస్ న్యాయస్థానం భారీ ఊరటనిచ్చింది. విదేశీ వృత్తి నిపుణుల కోసం ఉద్దేశించిన ప్రతిష్టాత్మక హెచ్-1బీ వీసాలపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విధించిన లక్ష డాలర్ల (భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 84 లక్షలు) భారీ అదనపు రుసుము నిబంధనను అమెరికా ఫెడరల్ కోర్టు పూర్తిగా రద్దు చేసింది. ట్రంప్ పరిపాలనా విభాగం తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తూ బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ సోమవారం సంచలన తీర్పు వెలువరించారు.చట్టవిరుద్ధమైన పన్నుగా గుర్తింపు..!విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా అయిన హెచ్-1బీ లాటరీకి ఎంపికైన అభ్యర్థులు విధిగా ఉత్తర్వును తీసుకువచ్చింది.

# 104 ఉద్యోగుల కష్టాలు తీర్చండి: సీఎంను కోరనున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**- వేతనాలు లేక 14 నెలలుగా అవస్థలు.. సమస్యల పరిష్కారానికి హామీ**



**రామచంద్రాపురం, జూన్ 09: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ప్రజలకు అత్యవసర ఆరోగ్య సేవలను అందిస్తున్న 104 సర్వీసెస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో 104 సర్వీసెస్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆయనను కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. గత కొంతకాలంగా వేతనాలు అందక, ఉద్యోగ భద్రత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డీఎంఈ పరిధిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులకు గత 14 నెలలుగా జీతాలు అందడం లేదని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్సీ అంజిరెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు చాలా న్యాయమైనవని పేర్కొన్నారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు, వేతనాల చెల్లింపు విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు సంబంధిత ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శివరాజ్, వెంకట్ రెడ్డి, కల్పన, వినోద, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 95 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి

**- 66,900 మంది రైతులకు 708,04 కోట్ల రూపాయలు చెల్లింపులు**
**- జిల్లా వ్యాప్తంగా 311 కొనుగోలు కేంద్రాలు మూసివేత**
**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్,జూన్,9,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**
జిల్లాలో 95 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా 84,531 మంది రైతుల నుంచి 3,85,122.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,66,900 మంది రైతులకు 708,04 కోట్ల రూపాయలు చెల్లింపు జరిపమన్నారు. జిల్లా వ్యాప్తంగా 311 కొనుగోలు కేంద్రాలు మూసివేశామన్నారు. రైతులు అకాల వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని , రైతులు అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని మంగళవారం ఒక ప్రకటన తెలిపారు.

# పారదర్శకంగాటెండర్ల ప్రక్రియ

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్,జూన్,9,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)** టెండర్ల ప్రక్రియ పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు. మంగళవారం ఐ డి ఓ సి కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ నగేష్ చైర్మన్ గా మెదక్ జిల్లా మహాత్మ జ్యోతిబాపూలే స్కూల్స్ , కాలేజీలలో 2026- 27 సంవత్సరానికి గాను పండ్లు ,కూరగాయలు ,చికెన్, మటన్, శానిటేషన్ సిబ్బంది, క్యాటరింగ్ సంబంధించిన టెండర్లు జరిగినవి కార్యక్రమానికి ఆర్ సి ఓ వీరేశం ,డిసిఓ హరిబాబు అన్ని స్కూల్ కాలేజీల ప్రిన్సిపల్లు , కమిటీ సభ్యులు టెండర్ దారులు హాజరు కావడం జరిగింది.
అన్ని టెండర్లను పారదర్శకంగా నిర్వహించామాన్నారు.

# దుర్గ భవాని అమ్మ వారు తొట్టెల కార్యక్రమం లో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ తాడేం వెంగళరావు



**చేగుంట జూన్ 9 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండల్ చందాయపెట్ గ్రామంలో శ్రీ దుర్గా మాత అమ్మవారి తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ తాడేం వెంగళ్ రావు, ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా, ఉపసర్పంచ్ నాగేష్ గుప్తా, డైరెక్టర్ మెహమ్మద్ ముజామిల్, జగన్, ఆలయ కమిటీ సభ్యులు అచంపేట్ యాదగిరి, బైండ్ల శివరాజయ్యా, ప్యారం రాజయ్యా, శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# గండిగూడెం చెరువు అభివృద్ధికి చర్యలు..

**- కాలుష్యకారక జలాలు చేరకుండా ప్రత్యేక కాలువ..**
**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**





**అమీన్ పూర్, జూన్ 09: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్పూర్ డివిజన్ పరిధిలోని గండిగూడెం చెరువులోకి కాలుష్య జలాలు చేరకుండా ప్రత్యేక కాలువ నిర్మించనున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం గండిగూడెం చెరువులో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ప్రధానంగా చెరువు అలుగు పెంచడం మూలంగా సమీపంలోని ఖాజిపల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో నీటిమట్టం పెరిగి ఇళ్ళలోకి నీళ్లు చేరుతున్నాయని ఇటీవల ప్రజలు తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని పేర్కొన్నారు. అలుగు మట్టాన్ని పూర్వస్థితికి తీసుకుని రావడంతో పాటు.. పరిశ్రమల నుండి కాలుష్య జలాలు చెరువులోకి చేరకుండా చెరువు సమీపం నుండి ప్రత్యేక కాలువ నిర్మించి వాటిని బయటకు పంపించడం జరుగు తుందని తెలిపారు. పరిశ్రమలు కాలుష్య జలాలు వదలకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువును పర్యా టక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానం దం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయ కులు భాస్కర్ గౌడ్, రాజు, గణేష్, నవీన్, సురేష్, పాల్గొన్నారు.

# గీతంలో 'తల్లి పేరిట మొక్క'

**- మొక్కలు నాటిన గీతం ఉన్నతాధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు**






**పటాన్ చెరు, జూన్ 09:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
దేశవ్యాప్త 'తల్లి పేరిట ఒక మొక్క' (ఏక్ పేడ్ మా కే నామ్) చొరవలో భాగంగా, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ప్రచారం, పర్యావరణ సుస్థిరత, జీవావరణ స్పృహను ప్రోత్సహిస్తూ, తమ తల్లుల గౌరవార్థం ఒక మొక్కను నాటమని పౌరులను ప్రోత్సహిస్తోంది. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు- (గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్) వివిధ గీతం స్కూళ్ల అధిపతులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, ప్రాంగణం లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును సృష్టించడం పట్ల గీతం యొక్క నిబద్ధతను ఈ చొరవ పునరుద్ఘాటించింది. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో, జీవవైవిధ్యాన్ని పెంపొందించడ ంలో, సుస్థిర జీవనాన్ని ప్రోత్సహించడంలో మొక్కలు నాటడం యొక్క ప్రాముఖ్యతను ఇందులో పాల్గొన్న ఉన్నతాధికారులు నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమం ప్రకృతి పట్ల శ్రద్ధ, పోషణ, బాధ్యత వంటి విలువలను ప్రతిబింబిస్తూ, తల్లులకు ఒక ప్రతీకాత్మక నివాళిగా కూడా నిలిచింది. మొక్కల పెంపకం కార్యక్రమం, సుస్థిరత, సామాజిక బాధ్యతను ప్రోత్సహించడానికి గీతం హైదరాబాదు చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు ఒక నిదర్శనంగా నిలుస్తుంది. ఇది పర్యావరణ పరిరక్షణ, దేశ నిర్మాణానికి అర్థవంతంగా తోడ్పడేలా గీతం సిబ్బందిని ప్రేరేపిస్తోంది.

# బీరంగూడలో అధికారుల నిర్లక్ష్యం.. గ్రీన్ మెడోస్ కాలనీ రోడ్డుపై ప్రాణసంకటంగా మారిన కల్వర్టు!

**- రోడ్డు పనుల్లో ఇంజనీరింగ్ లోపాలు: కాలువలో పడిపోతున్న వాహనాలు**
**- వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను డిమాండ్ చేసిన దండు రమేష్ యాదవ్**





**అమీన్‌పూర్, జూన్ 09:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ గ్రీన్ మెడోస్ కాలనీ ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు వాహనదారుల పాలిట మృత్యుపాశంగా మారుతోంది. గతంలో చేపట్టిన రోడ్డు పనుల్లో ఇంజనీరింగ్ విభాగం చేసిన ప్రణాళికా లోపం వల్ల, అక్కడ రోడ్డు లెవల్ సరిగ్గా లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం మొద్దునిద్ర వీడకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదాల నిలయంగా కల్వర్టు..**
మెయిన్ ఎంట్రన్స్ రోడ్డుపై ఉన్న ఈ కల్వర్టు దగ్గర రోడ్డు వెడల్పు సరిగ్గా లేకపోవడం మరియు డిజైన్ లోపాల కారణంగా, రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, కార్లు అదుపుతప్పి కాలువలో పడిపోతున్నాయి. ఇప్పటివరకు ఎంతోమంది వాహనదారులు గాయపడి, ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. వాహనదారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై దండు రమేష్ యాదవ్ మండిపాటు..**
ఈ సమస్యపై అమీన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యదర్శి దండు రమేష్ యాదవ్ ఘాటుగా స్పందించారు. "ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న అధికారులు, కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా రోడ్లు నిర్మించడం దారుణం. ఇంజనీరింగ్ అధికారుల ప్రణాళికా లోపాలకు సామాన్య ప్రజలు బలికావాలా?" అని ఆయన ప్రశ్నించారు.

**వెంటనే స్పందించాలి:**
గ్రీన్ మెడోస్ కాలనీ సమస్యపై వెంటనే జిహెచ్ఎంసి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కల్వర్టు దగ్గర భద్రతా గోడలు (రెయిలింగ్) నిర్మించ డంతో పాటు, రోడ్డును ప్రమాద రహితంగా మార్చేలా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. "ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యం. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే బాధితులతో కలిసి ఆందోళన చేపడతాం" అని రమేష్ యాదవ్ హెచ్చరించారు.

# ఏనుగండ్లలో పేకాట స్థావరంపై దాడి

**- ఏడుగురు పట్టివేత -- రూ.15,100 నగదు స్వాధీనం**
**- మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్**



**మెదక్,జూన్,9,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**
మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూల్చారం మండలంలోని ఏనుగండ్ల గ్రామంలో పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. మన్నే కిష్టయ్య కిరాణా షాప్ వెనుక భాగంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.15,100 నగదుతో పాటు పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చర్యల నిమిత్తం కూల్చారం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో పేకాట, జూదం, మాదకద్రవ్యాల రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో జరిగే చట్టవిరుద్ధ కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

# వడియారంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా మహాసభలు ప్రారంభం







**?చేగుంట, జూన్ 09 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం, తెలంగాణ రైతు సంఘం మెదక్ జిల్లా 3వ మహాసభలు చేగుంట మండల పరిధిలోని వడియారం గ్రామం ఎస్ఎల్వీఎన్ గార్డెన్స్‌లో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం, మహాసభల కరదీపికను రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, జిల్లా అధ్యక్షులు బొంత భాగయ్య, జిల్లా కార్యదర్శి మద్ది లక్ష్మి నర్సయ్య, జిల్లా కార్మిక శాఖ కార్యదర్శి మల్లేశం కలిసి ఆవిష్కరించారు. ఈ సభలో నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల ఎరువులు, డీజిల్ ధరలు పెరిగి రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహాసభలో వరి ధాన్యం కొనుగోళ్లు తక్షణమే పూర్తి చేయడం, జూన్ నెలలోనే రైతు భరోసా నిధులు విడుదల చేయడం, కాళేశ్వరం కాల్వల పనులు పూర్తి చేసి చేగుంట, నార్సింగి, రామాయంపేట్ తదితర మండలాలకు సాగునీరు అందించడం, భూసేకరణ బాధితులకు సరైన నష్టపరిహారం ఇవ్వడం మరియు ఉపాధి హామీలో రెండు ఫొటోల క్యాప్చర్ పద్ధతిని రద్దు చేయడం వంటి 9 కీలక తీర్మానాలను గురించి మాట్లాడినారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం మెదక్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక చేయడం జరిగింది . జిల్లా అధ్యక్షులుగా మద్ది లక్ష్మీ నరసయ్య చిట్టోజు పల్లి సర్పంచ్, జిల్లా కార్యదర్శిగా బొంత బాగయ్య పెద్ద శంకరంపేట్, జిల్లా ఉపాధ్యక్షులుగా అయిత దివాకర్ చేగుంట మండలం , జిల్లా సహాయ కార్యదర్శిగా లక్ష గౌడ్ ఘనపూర్, కమిటీ సభ్యులుగా మహమ్మద్ రఫీ,కాశ బోయిన భాస్కర్, బిక్య నాయక్, శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల కృష్ణ,ముత్యాలు,బోయినినరసింహులు 11 మంది ఎన్నికయ్యారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కేరాఫ్ అడ్రస్ ప్రభుత్వ పాఠశాలలు

**- విద్య రంగం లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి**





**మెదక్,జూన్,9,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**

విద్యార్థులు ఐ.ఐ.ఐ.టి వైపే కాకుండా దేశంలో ఉన్నత విద్యా సంస్థలైన ఎయిమ్స్ లాంటి ఉత్తమమైన వైద్య కళాశాలలో ప్రవేశాలు పొందడానికి ప్రయత్నించాలి,జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 91 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు , సన్మానాలు,ఎస్,ఎస్,సి,లో 560 ఆ పై మార్కులు సాధించిన ఉత్తమ ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మాన సత్కార ప్రశంసలు,విద్య రంగం లో మెదక్ జిల్లా ను మొదటి స్థానంలో నిలపాలనీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.మంగళవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో గత సం: పదవ తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. విద్యారంగంలో జిల్లా ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు. సమాజంలో వ్యక్తి నీ ఉన్నతమైన స్థాయిలో నిలపాలంటే విద్య ద్వారానే సాధ్యం అయితుందన్నారు . విద్యార్థులు ఐ.ఐ.ఐ.టి వైపే కాకుండా దేశంలో ఉన్నత విద్యా సంస్థలైన ఐఐటి లలో స్థానాన్ని పొందడానికి, ఎయిమ్స్ లాంటి ఉత్తమమైన వైద్య కళాశాలలో ప్రవేశాలు పొందడానికి ప్రయత్నించాలన్నారు.విద్యార్థులు ఉన్నతమైన శిఖరాలు అధిరోహించి భవిష్యత్తులో మంచిస్తాయి లో ఉండాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 91 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, 560 ఆపై మార్కులు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని, ఎగ్జిక్యూటివ్ ఫైల్ , డిక్షనరీ మరియు పెన్స్ ని అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ఏ ఎం ఓ సుదర్శన మూర్తి, కరుణాకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు , సహాయ గణాంక అధికారి నవీన్ , ఎంఈఓ లు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎమ్మార్పీలు , విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎఫ్ ఎల్ ఎన్ అమలులో ఎం ఈ ఓ లు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలదే కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.





**మెదక్,జూన్,9,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**

మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ఫలితాల మెరుగుదలకు (2026--27) విద్యా సంవత్సరానికి జిల్లా వార్షిక ప్రణాళికా వర్క్ షాప్ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, ఏ. సి. జి .ఈ. కరుణాకర్, సీఎం ఓ రాజు, ఏ ఎస్ ఓ నవీన్ , మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్స్, తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ మాట్లాడుతూ విద్యార్థులకు నిర్వహించిన బేస్ లైన్ అసెస్మెంట్ ఫలితాల ఆధారంగా విద్యార్థుల అభ్యసన సమార్థ్యాన్ని గుర్తించి రాబోయే డిసెంబర్ నాటికి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలని సూచించారు. అదే విధంగా మండల సమీక్ష సమావేశాల నిర్వహణ, కృత్రిమ మేధ ఆధారిత అభ్యసనాన్ని మెరుగుపర్చాల న్నారు. పాఠశాలలో విద్యార్థులు కనీస సామార్థ్యాలు సాధించేలా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలను ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు నిబంధనల మేరకు ఖచ్చితంగా తనిఖీ చేయాలని, ఉపాధ్యాయులు పాఠశాలల్లో పనితీరు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహణ చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించాలని అన్నారు.ప్రాథమిక విద్యాభివృద్ధికి ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరాసి (ఎఫ్ఎల్ఎన్) అత్యంత కీలకం. అని తెలిపారు. వార్షిక ఎఫ్ఎల్ఎన్ మూల్యాంకన ఫలితాలు, ఉపాధ్యాయుల అంచనా వివరాలు, జిల్లాలోని అభ్యాస ధోరణులను సమీక్షించి, రాబోయే విద్యా సంవత్సరానికి సబ్జెక్ట్వారీ లక్ష్యాలను ఖరారు చేయడం జరిగిందని తెలిపారు. , విద్యార్థుల అభ్యాస పురోగతి పర్యవేక్షణ, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల బలోపేతం, సహాయక పర్యవేక్షణ వ్యవస్థలు, సమీక్షా విధానాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. అలాగే పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు, చేపడుతున్నట్టు చెప్పారు.ఉపాధ్యాయులు, మెంటర్ల సామర్థ్యాభివృద్ధి, ప్రోత్సాహక వ్యవస్థలపై చర్చించడం జరిగింది అన్నారు. జిల్లా స్థాయి ప్రాధాన్యతలు, కాలపట్టికలు, బాధ్యతలు, జవాబుదారీతన వ్యవస్థలను ఖరారు చేస్తూ ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనకు సంయుక్త కార్యాచరణ ప్రణాళికను ఆమోదించడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో భవన నిర్మాణ కార్మికుల నిరసన ర్యాలీ




**చౌటుప్పల్, జూన్ 09 :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల భవన నిర్మాణ కార్మికుల సమ్మె మంగళవారం 4వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక పట్టణ కేంద్రంలోని హైవేపై భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేశారు. ఈ ర్యాలీకు వివిధ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. 55 సంవత్సరాలు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి రూ.5 వేల రూపాయలు పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికులకి ఈఎస్ఐ కార్డు సదుపాయం కల్పించాలన్నారు. అంతేకాకుండా ప్రమాదవశాత్తు మరణించినచో రూ.20 లక్షలు, అంగవైకల్యం కలిగితే రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలన్నారు. సంక్షేమ బోర్డు కార్డు ఉన్న ప్రతి కార్మికుడు సహజ మరణం పొందితే వారికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.కార్మికుల ఇంట్లో కుమార్తె వివాహానికి రూ.లక్ష అందించాలన్నారు. ప్రసూతి సమయంలో రూ.60 వేలు చెల్లించాలన్నారు. సంక్షేమ బోర్డు ప్రైవేటీకరణను ఎత్తివేసి ప్రభుత్వమే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు బొల్లమోని రాములు, నరసింహ, సుక్క యాదయ్య, ఎర్నం శ్రీనివాస్, నెలికంటి నరసింహ, కలకుంట్ల శివకుమార్, వెంకటయ్య చీమ కండ్ల శ్రీరాములు, మదారి మార్క్, సదానందం, నరసింహ, శ్రీను, జువ్వి యాదయ్య, లింగస్వామి, రేఖ మల్లయ్య, ఉబ్బు యాదయ్య, జాజుల భిక్షపతి, గజ్జల రాజు పాల్గొన్నారు.

# ప్రతిభా పాఠం: 500 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**- జూన్ 20న పటాన్చెరులో ఘనంగా పురస్కారాల ప్రదానం**
**- వెల్లడించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**





**పటాన్ చెరు, జూన్ 09:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన సుమారు 500 మంది విద్యార్థులకు సైకిళ్లు, ప్రశంసా పత్రాలను అందించనున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ కార్యక్రమంపై మంగళవారం పటాన్చెరులోని తన క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు.కార్యక్రమ వివరాలు:తేదీ: జూన్ 20సమయం: ఉదయం 10 గంటలకువేదిక: పటాన్చెరు మైత్రి మైదానంప్రతిభావంతులకు ప్రోత్సాహం:ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు పరీక్షలకు ముందే నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించామని, పరీక్ష సామాగ్రిని కూడా అందజేశామని గుర్తు చేశారు. చదువులో రాణిస్తున్న విద్యార్థులను అభినందించడం ద్వారా మరికొంతమందిని ఉత్తేజపరిచేందుకే ఏటా పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నగదు బహుమతులకు బదులుగా, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో సైకిళ్లను పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఈ సందర్భంగా సత్కరించనున్నట్లు ఆయన వివరించారు.విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని, విద్యార్థుల ఉత్సాహాన్ని రెట్టింపు చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పటాన్చెరు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, వివిధ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి హైడ్రా కమిషనర్‌కు ఎన్ హెచ్ ఆర్ జె ఎస్, ప్రతినిధుల వినతి

**- (స్పెషల్ కరస్పాండెంట్)**




**హైదరాబాద్,జూన్,9, మెదక్ టుడే న్యూస్:** సెక్రటేరియట్ కాలనీ మరియు శ్రీరామ్ నగర్ కాలనీలలోని పార్కు స్థలాల పునరుద్ధరణ, పరిరక్షణ అంశాలపై ( ఎన్ హెచ్ ఆర్ .ఎస్ .జె.సి) బృందం హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా ప్రజా పార్కు స్థలాలపై జరుగుతున్న ఆక్రమణల సమస్యను ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ సమస్యను ఓర్పుతో విని, పార్కు స్థలాలపై ఉన్న అన్ని ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే స్థానిక ప్రజల ప్రయోజనార్థం పార్కు స్థలాలను పునరుద్ధరించి, భవిష్యత్తులో వాటిని పూర్తిస్థాయిలో పరిరక్షించే చర్యలు చేపడతామని భరోసా కల్పించారు.ప్రజా స్థలాల పరిరక్షణకు, ప్రభుత్వ భూములను భావితరాల కోసం కాపాడేందుకు సానుకూల స్పందన వ్యక్తం చేసిన హైడ్రా కమిషనర్‌కు ఎన్హెచ్ఆర్జేఎస్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్హెచ్ఆర్జేఎస్ ప్రతినిధులు సర్వేందర్, అశోక్ కుమార్, లీగల్ ప్యానెల్ చైర్మన్ ఫణి ఒరుగంటి, ఆశా యాదవ్, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ టుడే దిన పత్రిక
బుధవారం, 10 జూన్ 2026

# రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీ నివాసాల్లో ఏసీబీ సోదాలు - భారీగా నగదు, బంగారం, వెండి స్వాధీనం



**హైదరాబాద్:** ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలతో రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్ ప్రాంతాల్లో మొత్తం 15 చోట్ల ఏసీబీ తనిఖీలు చేశారు. ఇవాళ రాత్రి వరకు అవినీతి నిరోధక శాఖ అధికారుల సోదాలు కొనసాగింది. దీనిలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.
ఏక కాలంలో 15 చోట్ల దాడులు : ఇవాళ ఉదయం 6 గంటల నుంచి ఏసీబీ అధికారులు బృందాలుగా విడిపోయి సోదాలు నిర్వహించారు. ఆర్ అండ్ బీ శాఖ ఈఎన్‌సీ మోహన్ నాయక్ నివాసం, కార్యాలయం, ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో తనఖీలు చేపట్టారు. హైదరాబాద్?లోని? మియాపూర్ వసంత విహార్‌లోని నివాసం, నిజామాబాద్ సహా 15 చోట్ల దాడులు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి వచ్చే కాంట్రాక్టులను తన స్నేహితులు, బంధువులకే ఇచ్చారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు.మొత్తం ఆస్తుల విలువ కోట్లు : మోహన్ నాయక్ నివాసంలో, కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అతడి నివాసంలో ఏసీబీ అధికారులు భారీగా ఆస్తులు గుర్తించారు. ఇప్పటి వరకు రూ.65 లక్షల నగదు, 10 గ్రాముల చొప్పున బరువున్న 15 బంగారు బిస్కెట్లు, బంగారం, వెండి లభించాయి. మొత్తంగా అతని వద్ద రెండున్నర కిలోల బంగారం, 6 కిలోల వెండి గుర్తించారు. వీటితో పాటు హైదరాబాద్, నిజామాబాద్‌లలో ఖాళీ స్థలాలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఇప్పటి వరకు ఏసీబీ అధికారులు గుర్తించారు.19 ఎకరాల వ్యవసాయ భూమి : నిజామాబాద్ జిల్లా ముల్లంగిలో 5 చోట్ల ఆస్తులు గుర్తించారు. ముల్లంగిలో 19.38 ఎకరాల వ్యవసాయ భూమి, కొంపల్లిలో ఫ్లాట్లు, గచ్చిబౌలిలో రూ. 7.4 కోట్ల విలువైన 4 ఫ్లాట్లు, మియాపూర్‌లో రూ.2.5 కోట్ల విలువచేసే విల్లా, కూకట్‌పల్లిలో రూ.62.14 లక్షల విలువచేసే ఇల్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అతడి బ్యాంకు ఖాతాల్లో రూ.1.44 కోట్ల నగదు గుర్తించారు. అతడి ఆస్తుల విలువ రూ. 18 కోట్లకు పైగానే ఉంటుందని ఏసీబీ అంచనా వేశారు.నగదు, బంగారం సీజ్ : ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై మోహన్?నాయక్? నివాసం, కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖకు చెందిన అనేక అనేక బృందాలు సోదాలు నిర్వహించాయని ఏసీబీ జాయింట్ డైరెక్టర్? ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్?తోపాటు నిజామాబాద్?లోనూ తనిఖీలు చేశామని వెల్లడించారు. నగదు, బంగారం, బంగారం బిస్కెట్?లు సీజ్? చేసినట్లు వెల్లడించారు. ఆస్తుల పత్రాలు కూడా గుర్తించామని తెలిపారు."ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై మోహన్‌నాయక్ నివాసం, కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖకు చెందిన అనేక అనేక బృందాలు సోదాలు చేశాయి. హైదరాబాద్?తోపాటు నిజామాబాద్?లోనూ తనిఖీలు చేశాం. నగదు, బంగారం, బంగారం బిస్కెట్?లు సీజ్? చేశాం. ఆస్తుల పత్రాలు కూడా గుర్తించాం"

# మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ వార్షిక తనిఖీ

- రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లపై నిరంతర నిఘా కొనసాగించాలి
- ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో పోలీసులే ఆదర్శంగా నిలవాలి.
- మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్





మెదక్,జూన్,9,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)
మంగళవారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలలో భాగంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పరిపాలన, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఎఫ్ఐఆర్‌ల నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదు విధానం తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ సిబ్బందికి కేటాయించిన సామగ్రి, సర్వీస్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి పెండెన్సీ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని ఆదేశించారు. నిష్పక్షపాత విధుల ద్వారానే ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ వంటి అంశాలపై కూడా ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేస్తూనే మరింత మెరుగైన పనితీరు కనబర్చాలని సూచించారు.అలాగే రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లలో ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని,వారి కదలికలు, ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారి ప్రస్తుత స్థితిగతులను తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. నేరాల నియంత్రణలో బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎస్పీ, వారి విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలతో పాటు వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు.సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొంటూ, వ్యక్తిగత ఇబ్బందులు ఉన్న వారు ప్రతి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తనను నేరుగా కలవవచ్చని తెలిపారు. దీంతో సిబ్బంది సమస్యలను స్వేచ్ఛగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు జార్జ్, సందీప్ రెడ్డి, ఎస్ఐ లింగం తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మెదక్ కలెక్టరేట్ ఆఫీస్ లో చేగుంట ఆదర్శ పాఠశాల విద్యార్థులను ఘనంగా సన్మానించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





చేగుంట జూన్ 9 మెదక్ టుడే న్యూస్







చేగుంట మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో 560 మార్కుల పైగా మార్కులు సాధించిన ఉత్తమ ప్రతిభ కనబరిచిన అస్మితా రాజ్ శ్రీనాథ్ గౌడ్, హర్షినిలను మంగళవారం రోజున జిల్లా కలెక్టర్ ప్రతివాసింగ్ ఘనంగా సన్మానించారు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎం చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరింత కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు మరియు కలెక్టర్ సన్మానం చేయడం సంతోషకరంగా ఉందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు

# 'మీ పేరిట ఫోన్ గిఫ్ట్‌గా వచ్చిందండీ' అంటూ ఫోన్ కాల్స్ వస్తున్నాయా - అయితే జాగ్రత్త పడాల్సిందే!



**హైదరాబాద్:** సైబర్ కేటుగాళ్లు కొత్త కొత్త ఎత్తుల తో మోసాలకు పాల్పడి సొమ్ములు కొల్లగొడుతున్నారు. ఒకప్పుడు ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెబితేనో వాట్సప్‌లో పంపిన లింక్ క్లిక్ చేస్తేనో నేరగాళ్లకు చిక్కి ఖాతాలో ఉన్న డబ్బులు ఖాళీ అయ్యేవి. కానీ దానిపై ప్రజల్లో అప్రమత్తత పెరిగింది. దాంతో సైబర్ కేటుగాళ్లు రూటు మార్చారు. కొత్తగా పార్శిల్ డెలివరీల దండుకుంటున్నారు.
పలు నగరాల్లోనూ ఇదే తరహా మోసాలు : ఇంటికి డెలివరీల పేరుతో కొన్ని ఫోన్లను పంపిస్తున్నారు. వాటిలో ముందుగానే కాల్‌ఫార్వర్డింగ్, ఇతర మోసపూరిత యాప్‌లు ఇన్‌స్టాల్ చేసి పంపుతున్నారు. అటువంటి పార్శిళ్లను తీసుకుని ఫోన్‌లో సిమ్ వేసిన వెంటనే సమస్తం నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుంది. అంతే ఖాతాల్లోని సొమ్మును స్వాహా చేస్తున్నారు. ఇటీవల ఇదే తరహాలో దిల్లీలో ఓ వ్యక్తి ఖాతా నుంచి కేటుగాళ్లు ఏకంగా రూ. 77 లక్షలు కొట్టేశారు. చెన్నై, బెంగళూరు నగరాల్లో కూడా ఈ విధంగా మోసాలకు పాల్పడుతున్నారు. ఆఫర్, ఇతర పేర్లతో మనకు తెలియకుండా కొరియర్లలో ఇంటికి వచ్చే ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో వాడొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.సంస్థల ప్రతినిధులమంటూ ఫోన్ కాల్స్ : సైబర్ నేరగాళ్లు ఈ కామర్స్, కొరియర్ సంస్థల ప్రతినిధుల తరహాలో ఫోన్‌లు చేస్తారు. ముందస్తుగా సేకరించిన వివరాల ఆధారంగా మన పేర్లతో మాట్లాడుతారు. మీ చిరునామాతో కొరియర్ వచ్చిందని నమ్మిస్తారు. ఎలాంటి బుకింగ్ చేయలేదని చెబుతే, పొరపాటున వచ్చిందని ధృవీకరించుకోవాలని చెబుతారు. అందుకే ి21ి హ్యాష్ డయిల్ చేయాలని చెబుతారు. వారు చెప్పినట్టు చేయగానే మనకు వచ్చే కాల్స్, ఓటీపీలు, వాట్సాప్ వెరిఫికేషన్ కోడ్ పూర్తిగా నేరగాళ్ల చేతికి చేరుతాయి. ఇక అంతే సంగతులు బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు కొల్లగొట్టేస్తారు.కేంద్ర టెలికమ్యునికేషన్స్ నుంచి కాల్స్? : వివిధ బ్యాంకులు, క్రెడిట్ కార్డు విభాగం, కేంద్ర టెలికమ్యునికేషన్స్ శాఖ ప్రతినిధులమంటూ కేటుగాళ్లు ఫోన్ చేస్తారు. డివోటీ ద్వారా సిమ్ కార్డు తనిఖీ చేసుకోవాలని లేకపోతే సేవలు నిలిచిపోతాయని చెబుతారు. దీని వెనుక ఉన్న అసలు మోసం గ్రహించకుండా ఎలా తనిఖీ చేసుకోవాలని అడిగితే చిరునామా అడిగి నేరుగా ఇంటికి ఫోన్‌ను కొరియర్ చేస్తారు. ఆ ఫోన్‌లో ముందుగానే మాల్వేర్ ఇన్‌స్టాల్ చేసి ఉంచుతారు. బాధితుడు సిమ్ కార్డు ఫోన్‌లో వేయగానే ఓటీపీలన్నీ నేరుగా నేరగాళ్లకు వెళ్లిపోతాయి. బ్యాంకు ఖాతాల నుంచి సులభంగా డబ్బులు బదిలీ చేసుకుంటారు. ఈ తరహా మోసాలకు నేరగాళ్లు ఎక్కువగా సెకెండ్ హ్యాండ్ ఫోన్లను వాడుతున్నట్టు పోలీసులు గుర్తించవెనుక ఉన్న అసలు మోసం గ్రహించకుండా ఎలా తనిఖీ చేసుకోవాలని అడిగితే చిరునామా అడిగారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని వారి మాటలను నమ్మి మోసపోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.' 'ప్రస్తుతం జరుగుతున్న కొత్త రకమైన మోసం ఏంటంటే గిఫ్ట్ స్కామ్. ఈ స్కావ్‌లో మీరు ఇలా గిఫ్ట్ గెలిచారని చెప్తారు. తక్కువ ధరలు కలిగిన కొన్ని ఫోన్లను పంపిస్తారు. వాటిల ఆటోమెటిక్ షేరింగ్ అనే అప్లికేషన్లు ముందే ఇన్?స్టాల్? చేసి పెడతారు. ఇలాంటి డివైస్‌లు వాడి వాటిలో మన బ్యాంక్ ఎకౌంట్ వాడినప్పుడు దానికి సంబంధించిన డేటాను మొత్తం వారు కాపీ చేసుకుంటారు. ఆ తర్వాత ఓటీపీని జెనెరేట్ చేసి ఎకౌంట్‌ను మొత్తం ఖాళీ చేస్తారు. ఇలాంటివి జరగకుండా ఎప్పటికీ మీ సిమ్ కార్డు, మొబైల్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలి. దానికి లాక్ పెట్టుకోవాలి. ఇంకొకటి సిమ్ కార్డు అనేవి కూడా ఉంటాయి. వీలైతే సిమ్‌కు లాక్ పెట్టుకోండి"

# జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ తనిఖీలు



మెదక్,జూన్,9,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)
మంగళవారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని వివిధ విభాగాలను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బెల్ ఆఫ్ ఆర్మ్స్, ఆర్ఐ స్టోర్స్, డ్యూటీ ఆఫీసర్ విభాగాలను సందర్శించి అక్కడి పనితీరు, రికార్డుల నిర్వహణ, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు.ముందుగా బెల్ ఆఫ్ ఆర్మ్స్‌ను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ, ఆయుధాల భద్రత, నిర్వహణ విధానాలు, ఆయుధాల జారీ మరియు స్వీకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయుధాల నిర్వహణలో నిర్దేశిత నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి లోపాలకు తావు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.అనంతరం ఆర్ఐ స్టోర్స్‌ను తనిఖీ చేసి పోలీసు శాఖకు సంబంధించిన సామగ్రి నిల్వలు, వాటి సంరక్షణ, పంపిణీ విధానాలను పరిశీలించారు. స్టోర్స్‌లోని వస్తువుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, అవసర మైన సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి డ్యూటీ ఆఫీసర్ విభాగాన్ని తనిఖీ చేసిన ఆయన, విధుల నిర్వహణ, రిజిస్టర్ల నిర్వహణ, సమాచార నమోదు విధానాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, అధికారిక రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ఈ సం దర్భంగా పోలీసు శాఖలో క్రమశిక్షణ, పారదర్శకత, బాధ్యతా యుతమైన విధుల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు ఎస్పీకుమార్ సింగ్ తెలిపారు. తనిఖీలలో ఆర్ఐ శైలందర్, ఆర్ఎసై నరేష్, హరీష్ రెడ్డి, మహిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై రామచంద్రాపురం డివిజన్‌లో అవగాహన సమావేశం



రామచంద్రాపురం, జూన్ 09:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి
తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు, భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు , మాజీ మంత్రివర్యులు హరీష్ రావు ఆదేశాల మేరకు పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ సూచనల మేరకు డివిజన్ పరిధిలోని ప్రతి బూత్ స్థాయిలో డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి బూత్ నుంచి ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగంపై అవగాహన కలిగి ఉండి, పార్టీ సభ్యత్వ నమోదు చేయగల ఇద్దరు యువతతో పాటు సీనియర్ బూత్ కోఆర్డినేటర్‌ను ఎంపిక చేసి ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు.పటాన్‌చెరు నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ప్రజలను చేరుకునే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని, ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి కూడా ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. బూత్ స్థాయిలో ఓటర్ల వివరాలను పరిశీలించడం ద్వారా డూప్లికేట్ ఓటర్లు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్, గోవింద్ యాదవ్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..